## క్లుప్తంగా

### ఘనంగా షిర్డీ సాయి మందిరం వార్షికోత్సవం



కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పాయకరావుపేట : పట్టణంలో బృందావనంలో గల శ్రీ షిరిడి సాయిబాబా మందిరం 25 వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం కాకడ హారతి, మహాపూర్ణ హారతి, 108 కలశాలతో ఊరేగింపు, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### రామావతారంలో జగన్నాథుడు



రామావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక : మండలంలోని నాగులాపల్లి, మునగపాక గ్రామాల్లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు సోమవారం భక్తులకు రామావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 29న జగన్నాథస్వామి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

### నేడు విద్యుత్‌కు అంతరాయం

పాయకరావుపేట : పట్టణంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ కండక్టర్‌ను మార్చడం, మరమ్మతుల కారణంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. లింగాలకాలనీ, ఇందిరాకాలనీ, అంబేద్కర్ కాలనీ, దుర్గానగర్, శాంతినగర్, షీలానగర్, ధనిశెట్టి నగర్, జి.వి.ఆర్.నగర్, ప్రశాంతినగర్, రాజీవ్‌నగర్‌కాలనీ, పి.ఎల్.పురం, సీతారాంపురం ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### అదనపు బాధ్యతలు వద్దు

మునగపాక : అంగన్‌వాడీ కార్యకర్తలకు అదనపు బాధ్యతలు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు శ్రీనివాసరావు, మహేశ్వరరావు, బ్రహ్మాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలపై అదనపు భారం మోపడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవన నిర్మాణ బాధ్యతల నుంచి మినహాయింపు ఇచ్చేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ యూనియన్ సెక్టార్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కె.వెంకటాపురంలో 'గడప గడపకు' నేడు

కోటవురట్ల : కె.వెంకటాపురంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

### ఓటరు నమోదుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాశరావు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించాలని తహసీల్దార్ పి.ప్రకాశరావు కోరారు. మునగపాక మండల పరిషత్ హాలులో సోమవారం సాయంత్రం అచ్యుతాపురం, మునగపాక మండలాల బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరుకు సంబంధించిన మార్పులు, చేర్పులపై దృష్టి సారించాలన్నారు. నవరణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అచ్యుతాపురం తహసీల్దార్ శ్రీనివాసరావు సమావేశంలో పాల్గొన్నారు.



# డ్రగ్స్ నిర్మూలనకు కృషి అవసరం

- యలమంచిలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిలు స్వాతిభవాని, వీరరాఘవేంద్రరావు
- విద్యార్థులకు అవగాహన

యలమంచిలి : చిన్నతనంలోనే ఎక్కువ మంది డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావడం వల్ల అనారోగ్యాల పాలై ఇబ్బందులు పడుతున్నారని యలమంచిలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతిభవాని అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

యువత చెడు వ్యసనాలు విడనాడి విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని వాటి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం ఏటా జూన్ 26న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చట్టాలు అమలు అవుతాయని తెలిపారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి టి.వీరరాఘవేంద్రరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం ప్రమాదకరమైన వ్యసనం అని అన్నారు. మద్యపానం, ధూమపానం కంటే డ్రగ్స్ వినియోగం అత్యంత ప్రమాదకారి అని, ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా 5.6శాతం జనాభా అనగా 185 మిలియన్ల మంది ఇలా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్టు అంచనాలు తెలుపుతున్నాయని తెలిపారు. మత్తుకు అలవాటు పడిన యువత జీవితాన్ని నాశనం చేసుకుని నేరాల బాట పడుతున్నారని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు భారత ప్రభుత్వం పటిష్ట చట్టం చేసిందని, తద్వారా డ్రగ్స్ రవాణా, వినియోగానికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులంతా చెడు వ్యసనాలకు దూరంగా జరగాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సరోజని, బార్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస పట్నాయక్, కోర్టు సిబ్బంది నిర్మల, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జిలు

**మాదకద్రవ్యాల రవాణా నేరం**

ఎస్.రాయవరం : డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ ప్రసాద్‌రావు అన్నారు. అడ్డురోడ్డు కూడలిలో సోమవారం విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడితే జీవితం నాశనం అవుతుందని, అందువల్ల వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్రభుత్వం డ్రగ్స్ రహిత సమాజం నెలకొల్పాలని కృషి చేస్తోందన్నారు. డ్రగ్స్ రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి ఎస్ఐ శిరీష పాల్గొన్నారు.

**డ్రగ్స్ జోలికి పోవద్దు**

రాంబిల్లి : విద్యార్థులు మత్తు పదార్థాలు, ఇతర డ్రగ్స్ జోలికి పోవద్దని ఎస్ఐ దీనబంధు హితవు పలికారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాంబిల్లిలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. మెయిన్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలను ఎస్ఐ వివరించారు.

**విద్యార్థుల ప్రతిజ్ఞ**

యలమంచిలి : చెడు అలవాట్లకు యువత దూరంగా మెలగాలని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ అన్నారు. సోమవారం యలమంచిలి పట్టణంలో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు సెబ్ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ షేక్ గఫూర్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌ను అక్రమంగా తరలిస్తే చట్టరిత్యా నేరమని అన్నారు. విద్యార్థులు ఎక్కువగా డ్రగ్స్‌కు బానిసలు అవుతున్నారని, దీని వల్ల పెడదారి తొక్కి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. గంజాయి, డ్రగ్స్ ఎవరైనా కలిగి ఉన్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణ ఎస్ఐ పాపినాయుడు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ గణేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రసాద్‌రావు



రాంబిల్లి జంక్షన్‌లో మానవహారం



యలమంచిలిలో డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ షేక్ గఫూర్, ఎస్ఐలు పాపినాయుడు, గణేష్, విద్యార్థులు

# టోకెన్ జనరేషన్ విధిగా పాటించాలి

నక్కపల్లి : వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష పథకానికి సంబంధించి లబ్ధిదారుల నుంచి తీసుకునే దరఖాస్తులకు టోకెన్లు విధిగా జారీ చేయాలని తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. సోమవారం ఉద్దండపురం, వేంపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష పథకానికి సంబంధించి సర్వేను పరిశీలించారు. టోకెన్ జనరేషన్, సర్వీసెస్ జనరేషన్ కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోనే ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వలంటీర్ మొబైల్‌లో ఉన్న యాప్‌లో దరఖాస్తుదారు వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన ఫార్మెట్‌లో దరఖాస్తు నింపి టోకెన్ జారీ చేయాలన్నారు. ఏయే సర్వీసుల కోసం దరఖాస్తులు వచ్చాయనే వివరాలు కూడా తయారు చేయాలన్నారు. దరఖాస్తుదారులను గ్రామసభ రోజున అధికారుల వద్దకు తీసుకెళ్లి వారికి కావాల్సిన ధ్రువపత్రాలను నిబంధనల మేరకు జారీ చేయించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తిరిగి జగనన్న సురక్ష కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. నెలరోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని, జూలై ఒకటో తేదీ నుంచి మండల స్థాయి అధికారుల బృందం గ్రామాల్లో పర్యటిస్తుందన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు కోరారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం జూలై ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తారని, ఇందుకు రెండు బృందాలు పనిచేస్తాయని తెలిపారు. ప్రస్తుతం కోటవురట్ల, చౌడువాడ, కైలాసపట్నం గ్రామాలలో సర్వే జరుగుతోందని తెలిపారు. జూలై 1న చౌడువాడ, కోటవురట్ల-1, 4న రాజుపేట, కోటవురట్ల-2, 6న పందూరు, లింగాపురం, 11న చినబొడ్డేపల్లి, కైలాసపట్నం, 13న కె.వెంకటాపురం, రామచంద్రపాలెం, 18న కొడవటిపూడి, బి.కె.పల్లి, 20న పి.కె.పల్లి, తంగేడు, 25న బోడపాలెం, సుంకపూరు, 27న పాములవాక, అన్నవరం, 28న యండపల్లి గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కోటవురట్ల : సమస్యల తక్షణ పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మాజీ ఉప సర్పంచ్ పెట్ల వెంకటరమణ అన్నారు. బి.కె.పల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెంకట రమణ మాట్లాడుతూ 11 రకాల సేవలకు సంబంధించి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అధికారులు, వలంటీర్లు సర్వే సక్రమంగా నిర్వహించి సమస్యలను గుర్తించాలని కోరారు.



ఉద్దండపురంలో టోకెన్ జనరేషన్ పరిశీలిస్తున్న అధికారులు



కొరుప్రోలు సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్రమూర్తి



మామిడివాడ గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు

**జగనన్న సురక్ష విజయవంతం చేయాలి**

ఎస్.రాయవరం : జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం కావాలంటే గ్రామ వలంటీర్లు , సచివాలయ సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేయాలని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. కొరుప్రోలు, గుడివాడ, గుర్రాజుపేట తదితర గ్రామాల్లో సోమవారం గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో జగననన్న సురక్ష కార్యక్రమానికి షెడ్యూల్లు ప్రకటించామని, ఈలోగా ప్రతి వలంటీర్ అవసరమైన ధ్రువ పత్రాలకు, కావాల్సిన డాక్యుమెంట్లు తీసుకుని వీలుంటే ధ్రువీకరణ పత్రం సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. కార్యక్రమం రోజున పెద్ద ఎత్తున లబ్ధిదారులు వస్తే సిబ్బంది, వలంటీర్లు విధిగా సర్వీసులు అందించాలన్నారు. ఇందులో ఏ ఒక్కరు నిర్లక్ష్యం చేసినా సహించేది లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరపాటి గోపాలం, వీఆర్వో శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**చురుగ్గా జగనన్న సురక్ష సర్వే**

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై చురుగ్గా సర్వే నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు , సచివాలయ ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వారికి ఏయే సర్టిఫికెట్లు కావాలో వివరాలు అడిగి నమోదు చేసుకుంటున్నారు.

# సబ్సిడీ విత్తనాల పంపిణీ

అనకాపల్లిటౌన్ : నాణ్యమైన వరి విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తోందని వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్ తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామాలైన గొర్లివానిపాలెం, రాజుపాలెం, ఎరుకువానిపాలెం గ్రామాల(26వ సచివాలయం) పరిధి రైతులకు సోమవారం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతే రాజు అనే సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి అని కొనియాడారు. అన్నంపెట్టే రైతును కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తమ ప్రభుత్వంలో సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు నేరుగా అధికారులకు సంప్రదించి మెరుగైన సాగు పద్ధతులు, సమస్యల పరిష్కారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగం అధికారులు గణేష్, అజయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ అప్పలనాయుడు, నాగిరెడ్డి రాంబాబు, అప్పలనాయుడు, రాజు, రమేష్, విల్లూరి శేఖర్, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు అందిస్తున్న కొణతాల భాస్కర్

# కౌలు రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

తుమ్మపాల : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతు భరోసా మంజూరు చేసి, పంటల సాగుకు రుణాలు అందించి, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. పట్టణంలోని కొడుగంటి గోవిందరావు భవనంలో సోమవారం రైతు సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ కౌలు రైతులకు పంటనష్టం వాటిల్లడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం కౌలు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 26 నుంచి 30 వరకు ప్రచారం చేస్తున్నామన్నారు. వచ్చే నెల 3న సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. 10, 11 తేదీల్లో రిలే నిరాహారదీక్షలు చేయనున్నట్టు తెలిపారు. అంతకు ముందు ర్యాలీగా నాలుగు రోడ్ల జంక్షన్‌కు చేరుకుని, నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజాన దొరబాబు, రావు జగ్గారావు, గొల్ల గురుబాబు, సన్యాశిరావు, మేక సత్యనారాయణ పాల్గొన్నారు.




కౌలు రైతులకు న్యాయం చేయాలంటూ నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

### పోలవరం కోసం మహాపాదయాత్ర

అనకాపల్లిటౌన్ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు చట్ట ప్రకారం తక్షణమే పునరావాసం, పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జూలై 4వ తేదీ వరకూ పోలవరం పోరుకేక పేరుతో మహా పాదయాత్రలో భాగంగా నిధి వసూళ్లను సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా 400 కిలోమీటర్లు మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.శంకరరావు, ఎ.బాలకృష్ణ, గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల ఏర్పాటు కోరుతూ ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక నెహ్రూచౌక్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరమణ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేలా డిగ్రీ కళాశాలను పూర్తి స్థాయి సిబ్బందితో ఏర్పాటు చేయాలన్నారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. సకాలంలో పాఠ్యపుస్తకాలను అందించి, విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# మీ సమస్యల పరిష్కారానికే మీ ఊరొచ్చా...



కె.వెంకటాపురంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: నేరుగా మిమ్మల్ని కలుసుకుని సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం కోసమే మీ ఊరొచ్చా.. సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు మీ ఇంటికొచ్చా..ఏ సమస్య ఉన్నా నాతో చెప్పండి అంటూ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అందరినీ ఆప్యాయంగా పలకరించారు. కె.వెంకటాపురంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లు పింఛను డబ్బులు సక్రమంగా ఇస్తున్నారా..వారి సేవలు సక్రమంగా ఉన్నాయా..ఇళ్లు కట్టుకుంటారా చెప్పండంటూ గ్రామస్తులను ఆరా తీశారు. జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. పీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఆర్బీకే ద్వారా రైతులకు విత్తన పంపిణీ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. మెయిన్‌రోడ్డును అభివృద్ధి చేయాలని, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని, సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేయాలని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ ఎమ్మెల్యేను కోరారు. వాటన్నిటినీ పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ, మతం, కులం చూడకుండా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు వరకు లబ్ధి కలుగుతోందని, ఈ సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అమలు జరగాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీటీసీ ఉమాదేవి, సర్పంచులు పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ, కోసూరు అప్పారావు, అనిల్‌కుమార్, శివరామ్, ఎరుకునాయుడు, ఎంపీటీసీలు కాళ్ల రత్నం, రాంబాబు, పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, ఆర్.ఎస్ నారాయణమూర్తిరాజు, చిట్టిబాబు, నాని, రమణమూర్తి, రామునాయుడు, కిషోర్, బాలేపల్లి సత్యనారాయణ, సత్యవతి, శ్రీరామ్మూర్తి, రాజులనాయుడు, బాబ్జీ, శెట్టి రమణ, భాస్కరరావు, మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, తహసీల్దారు జానకమ్మ, ఏవో చంద్రశేఖర్, సీఐ నారాయణరావు పాల్గొన్నారు.

# గొర్రెలలో వ్యాధుల నివారణకు చర్యలు

పాయకరావుపేట : గొర్రెలకు వ్యాధులు, నట్టలు సోకకుండా వైద్యం అందిస్తున్నట్టు యలమంచిలి కృషి విజ్ఞాన కేంద్రం పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయరాజ్ని తెలిపారు. మండలంలో వి.కొత్తూరు గ్రామంలో గల పలువురు రైతులకు చెందిన గొర్రెలకు సోమవారం వైద్య సేవలు అందించామన్నారు. హరిజన ఉప ప్రణాళికలో భాగంగా 70 మేకలకు, 40 గొర్రెలకు నట్టలు నివారణకు మందులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ రైతు ఉత్పత్తిదారుల సంఘం సిఈవో జి.వి.వి సత్యనారాయణ పాల్గొన్నారు.



మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న డాక్టర్ విజయరాజ్ని

# పిల్లల చదువులపై దృష్టి సారించండి

మునగపాక : తల్లిదండ్రులు విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీతో సమావేశం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలు ప్రయివేటు స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పీఎంసీ చైర్మన్ ఆడారి మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెచ్‌ఎం నరసింగరావు, వార్డు సభ్యులు గోవిందరావు, వరలక్ష్మి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు

# విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

ఎస్.రాయవరం : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు సద్వినియోగం అవుతున్నాయని, తల్లిదండ్రులు సంతృప్తికరంగా ఉన్నారని దార్లపూడి, పి.ధర్మవరం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమణశ్రీ , ఎస్.వి.రమణారావు అన్నారు. ఆయా పాఠశాలల్లో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. నాలుగేళ్లుగా విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి వంటి పనులపై తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ నెల 28న అమ్మఒడి నగదు జమ కానుందని, ప్రభుత్వం చిత్తశుద్ధితో చెప్పిన పనిచేస్తోందని, విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు.

# రాయితీపై విత్తనాల పంపిణీ

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. ప్రభుత్వ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నామన్నారు. ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏ కళ్యాణి, పీఏసీఎస్ సీఈవో ఆడారి కృష్ణ, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మునగపాకలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

# శ్రీరంగ కుటుంబ సభ్యులకు పరామర్శ

రాంబిల్లి: కొత్తపేట మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నబాబురాజు హాజరయ్యారు. శ్రీరంగ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. శ్రీరంగ చేసిన సేవలను కొనియాడారు. మండలంలో పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



శ్రీరంగ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

### జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం

మునగపాక : జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి అన్నారు. తిమ్మరాజుపేటలో జగనన్న సురక్ష పథకంపై వలంటీర్లతో కలిసి ఆమె సోమవారం ప్రచారం నిర్వహించారు. ఇంతవరకు ప్రభుత్వ పథకాలకు నోచుకోలేని వారికి ఈ కార్యక్రమం సువర్ణావకాశం అన్నారు.

### వరి విత్తనాల పంపిణీ రేపు

కశింకోట : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఈ నెల 28న మధ్యాహ్నం 3 గంటలకు ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాల్సిందిగా కోరారు.